

## మెరుగైన వైద్య సేవలందించాలి

ఆమనగల్లు, జూన్ 13: ప్రభుత్వాలు పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండల పరిధిలోని మంగళపల్లి గ్రామానికి చెందిన కొప్పు మల్లేష్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ. 51వేల చెక్కును శుక్రవారం బాధితుడికి ఆయన అందజేశారు.

## రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోండి

కేశంపేట, జూన్ 13 : ప్రభుత్వం అందజేస్తున్న పెట్టుబడి సాయాన్ని పొందేందుకు రైతులు రైతు భరోసాకోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి శిరీష మండల రైతులను కోరారు. 2025 జూన్ 5లోపు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలు రైతు వేదికల్లోని ఏఈవోలకు అందజేయాలని సూచించారు.

# పంట మార్పిడితోనే అధిక దిగుబడి

**వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ రమ్య**



కార్యక్రమంలో మాట్లాడుతున్న జయశంకర్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రమ్య

చేవెళ్ల రూరల్, జూన్ 13: పంట మార్పిడితోనే మట్టి ఆరోగ్యంగా ఉంటుందని జయశంకర్ వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రమ్య సూచించారు. శుక్రవారం చేవేళ్ల మండల పరిధి పామెన గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో, వ్యవసాయ శాఖ సహకారంతో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. యూరియా వాడకాన్ని తగ్గించడం, పంట మార్పిడి ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కవితాకిరణ్ మాట్లాడుతూ చెట్ల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షించవచ్చన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్.స్నేహలత పోషకాహారం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్ లాల్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీబాలకోటేశ్వర్ ఆయిల్ పామ్ సాగు పద్ధతులపై సమాచారం అందించారు. కార్యక్రమంలో రైతులతో పాటు విద్యార్థులు కె.రాజేశ్, ఎం.అపూర్వ, ఎస్.కౌశల్య, కె.గిరిబాబు పాల్గొన్నారు.

**రైతులు భూసార పరీక్షలు చేయించాలి**

మంచాల : పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ వానకాలంలో రైతులు భూసార పరీక్షలు నిర్వహించడంతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు సూచనల మేరకే పంటలు సాగుచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత, శాస్త్రవేత్తలు శ్రీనివాస్, సునిత, మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణమోహన్, ఏఈవో నిఖిత పాల్గొన్నారు.

**సేంద్రియ వ్యవసాయం చేయాలి**

మొయినాబాద్ : రైతులు సేంద్రియ వ్యవసాయం చేయడానికి అలవాటు పడాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధవి, లీలా రాణి అన్నారు. రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని సజ్జన్‌పల్లిలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయ చేయడానికి అలవాటు పడాలని చెప్పారు. సదస్సులో పాల్గొన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చంద్రారెడ్డిని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఏఈవో కుమార్, రైతులు అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, అనంతరెడ్డి, గోపాలరావు, బాల్‌రెడ్డి, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.



మంచాల : రైతులు వేదికలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహరావు

**యాజమాన్య పద్ధతులు పాటించాలి**

షాబాద్, జూన్ 13: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని గురువారం మండల పరిధిలోని తిర్మలాపూర్, రుద్రారం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సతీశ్, శ్రీనివాస్‌రెడ్డి, శిరీషా మాట్లాడుతూ.. వివిధ పంటల్లో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. పత్తి, మొక్కజొన్న పంటల్లో వచ్చే కలుపు, చీడపీడల గురించి వివరిస్తూ, పంట మార్పిడి పద్ధతి విధిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, వ్యవసాయ శాఖ పరిశోధన సంస్థ విద్యార్థి ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ శాస్త్రవేత్త అర్చన, రీసెర్చ్ స్కాలర్స్ రాజేందర్, ఏఈఓలు రాజేశ్వరి, వరుణ్‌కుమార్, కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి

## బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 13 : పిల్లలు ఉండాల్సింది బడిలో కానీ పనిలో కాదని రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినం సందర్భంగా జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సురక్షా సేవా సంఘం, హయత్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సౌజన్యంతో గురువారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ఎల్బీనగర్ డీసీపీ కోటేశ్వరరావుతో కలిసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ చిన్నపిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే విధంగా ప్రోత్సహించి బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని సూచించారు. సమావేశంలో సీఐ అశోక్‌రెడ్డి, సురక్షా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపిశంకర్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా టీపీసీసీ లీగల్ చైర్మన్ భిక్షపతిగౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షుడు సతీశ్, మాజీ కార్యదర్శి సంతోష్‌గౌడ్, స్థానిక సబ్ఇన్స్పెక్టర్ మాధవరావు, బార్‌అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు రాజేష్, జంగయ్య, సాయికుమార్, సైదులు, సతీష్, జయసుధ, పద్మజ, మేఘన, శృతి, సాంబశివరావు, నాగమణి పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి

నందిగామ, జూన్13: షాద్‌నగర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో నందిగామ, కొత్తూర్, కొందుర్గు, చౌదరిగూడ, ఫరూక్‌నగర్ మండలాలకు చెందిన పలువురికి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఆయన వెంట ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

**కొందుర్గులో..**

కొందుర్గు : మండలంలోని తంగెళ్లపల్లి గ్రామనికి చెందిన బుట్ట చెన్నయ్య, తంగెళ్లపల్లి గ్రామనికి చెందిన బుట్ట రాము అనారోగ్యంతో బాధపడుతుండగా, మెరుగైన వైద్యం కోసం.. సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఆయన వెంట ఉమ్మడి మండలాల నాయకులు మాజీ జడ్పీటీసీ తనయుడు రామకృష్ణ, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు బాబురావు, వెంకటేశ్, జనార్దన్‌గౌడ్, శ్రీశైలం, రవినాయక్ దర్గా రామచెంద్రయ్య, రమేశ్ నాయక్, తంగెళ్లపల్లి మాజీ ఉప సర్పంచ్ నర్సింహులుగౌడ్, నర్సింహులు, రవీందర్ గౌడ్, చంద్రయ్య, యూత్ నాయకులు పెరుమాల్‌రెడ్డి, ఉప్పరి సత్యం పాల్గొన్నారు.



చరికొండ గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, నాయకులు

## లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి

కడ్తాల్, జూన్ 13: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు అందడంలేదని విమర్శించారు. ఆ పార్టీ నాయకులకే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించారని ఆరోపించారు. చరికొండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు 950 మంది దరఖాస్తులు చేసుకుంటే కేవలం 21 మందిని ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ అందజేశారన్నారు. పేదలకందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందజేస్తామని ప్రకటించిన రేవంత్ సర్కార్, వాటిని మంజూరు చేయడంలో విఫలమైందన్నారు. ఇండ్ల నిర్మాణంలో నిబంధనలను తొలగించి మొత్తం డబ్బులను లబ్ధిదారుడి ఖాతాల్లో జమచేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, వెంకటయ్యాయాదవ్, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, మాజీ ఎంపీటీసీ చంద్రమౌళి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు జంగయ్య, సింగిల్‌విండో మాజీ చైర్మన్ యాదయ్య, నాయకులు సాబేర్, శ్రీనివాస్, గోపాల్‌గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం అందజేత



చేవెళ్ల మండల కేంద్రంలోని మల్లన్న దేవాలయ నిర్మాణానికి శుక్రవారం చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర సమత వెంకట్‌రెడ్డి, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి రూ.30లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారిని మల్లన్న స్వామి ఆలయ కమిటీ సభ్యులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **- చేవెళ్లటౌన్, జూన్ 13**

## జర్నలిస్టులపై దాడులు సరికాదు



తుర్కయాంజాల్, జూన్ 13: జర్నలిస్టులపై దాడులను ఖండిస్తూ శుక్రవారం మున్సిపాలిటీ చౌరస్తాలో టీడబ్ల్యూజేఎఫ్ (తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి జగదీష్ మాట్లాడుతూ జర్నలిస్ట్‌లపై కొనసాగుతున్న దాడులు సరైనవి కాదని, వాటిని ఖండిస్తున్నామని తెలిపారు. ఇందుకు స్థానిక రాజకీయ నాయకులు రమేశ్, కిషన్ తదితరులు మద్దతు పలికారు. కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం



మాణిక్యం (ఫైల్)

చేవెళ్ల రూరల్, 13 జూన్ : తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా యువకుడు అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ లో చోటుచేసుకున్నది. సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండల పరిధి చన్ వెళ్లి గ్రామానికి చెందిన వీరవొల్ల జంగయ్య, భార్య నీలమ్మ వ్యవసాయం చేసుకుంటూ కుమారుడు మాణిక్యం (22)తో జీవిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 6వ తేదీ న తల్లిదండ్రులు కుమారుడు మాణిక్యంను ఇంట్లో ఓ విషయంపై మందలించారు. దీంతో మనస్తాపం చెందిన మాణిక్యం ఎవరికీ చెప్పకుండా ఇంట్లోంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## ప్రమాదకరంగా కరెంట్ స్తంభం



మండలంలోని నాందార్‌ఖాన్‌పేట్ గ్రామంలో కరెంట్ స్తంభం విరిగిపడి ప్రమాదకరంగా మారింది. అదే గ్రామానికి చెందిన మేకల ముత్యాలు రైతు పొలంలో కొన్ని కొద్ది రోజుల క్రితం కరెంట్ స్తంభం వ్యవసాయ పొలంలో విరిగి పడింది. ఈ విషయమై విద్యుత్‌శాఖ చేవెళ్ల ఏడీఏ కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. వెంటనే కరెంట్ స్తంభం సరిచేయాలని రైతు కోరుతున్నాడు.

**- షాబాద్, జూన్ 13**

# చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



మంచాల : పాఠశాలలో విద్యార్థులతో అక్షరాలు దిద్దిస్తున్న ఎంఈవో రాందాస్

కేశంపేట, జూన్ 13 : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో చిన్నారుల చేత సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, మండల విద్యాధికారి చంద్రశేఖర్ పాల్గొని పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందజేయడంతోపాటు చిన్నారుల చేత సామూహిక అక్షరాభ్యాసం చేయించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్యసింగ్, మాజీ జడ్పీటీసీ విశాలశ్రావణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, ఉపాధ్యాయులు సీతారాం, అపర్ణ, స్వప్న, లోకేశ్వరి, నాయకులు కరుణాకర్‌రెడ్డి, అనసూయ, లక్ష్మయ్య, మాధవరెడ్డి, శ్రీను, విద్యా సంరక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**మంచాల :** మంచాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరభ్యాస కార్యక్రమంలో మంచాల విద్యాధికారి రాందాస్ విద్యార్థులతో అక్షరాభ్యాస చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాన్సీ రాణి, తుల్జారాం, రుబియానా, ఉపాధ్యాయులు నారామణరెడ్డి, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

**బాటసింగారం ప్రాథమిక పాఠశాలలో ..**

అబ్దుల్లాపూర్‌మెట్ : మండలంలోని బాటసింగారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి విగ్రహం వద్ద సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం విద్యార్థులచే అక్షరాలు దిద్దించారు.



బాటసింగారం ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు



కేశంపేటలో విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న నేతలు

## పార్కు స్థలం కబ్జాకు యత్నం

**అడ్డుకున్న మున్సిపల్ అధికారులు**



తుర్కయంజాల్,జూన్ 13: మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని సర్వే నంబర్ 227, 228లోని 871 గజాల పార్కు స్థలం కబ్జాకు శుక్రవారం కొందరు వ్యక్తులు ప్రయత్నించగా మున్సిపల్ అధికారులు పనులను అడ్డుకున్నారు. అను-మను ఎన్‌క్లేవ్‌కు సంబంధించిన 871 గజాల పార్కు స్థలం ఉంది. అయితే మున్సిపాలిటీ అధికారులు పార్కు స్థలాన్ని స్వాధీన పర్చుకోకపోవడంతో పలువురు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ స్థలాన్ని కబ్జా చేయడానికి ఇప్పటికే పలుమార్లు ప్రయత్నించారు. శుక్రవారం ఉదయం జేసీబీ సహయంతో పార్కు స్థలాన్ని చదును చేస్తుండగా స్థానికుల ఫిర్యాదుతో మున్సిపల్ అధికారులు పనులను అడ్డుకున్నారు. ఈ వివాదాస్పద స్థలాన్ని కొందరు వ్యక్తులు బై నంబర్‌లతో రిజిస్ట్రేషన్ చేసుకొని మున్సిపాలిటీలో భవన నిర్మాణ అనుమతుల కోసం ప్రయత్నించారు. అయితే అధికారులు వీటి అనుమతులను నిరాకరించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పార్కు స్థలాన్ని స్వాధీన పర్చుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం నాగేశ్

షాద్‌నగర్‌టౌన్, జూన్ 13: బడీడు పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఫరూఖ్‌నగర్ మండల ఏపీఎం నాగేశ్ అన్నారు. మండలంలోని మధురాపూర్ గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రులకు మాజీ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సులోచన, మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రంగయ్య, సీసీ వెంకటయ్య, పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీలో చేర్పించాలి**

తుర్కయాంజాల్ : చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరుతూ మున్సిపాలిటీ పరిధి శ్రీరామ్ నగర్‌కాలనీ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్యాణి, టీచర్ స్వప్న శుక్రవారం అమ్మమాట-అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌నగర్ కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయమ్మ నాగమణి పాల్గొన్నారు.

## గుంతలు పూడ్చండి..



చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని హైదరాబాద్ -బీజాపూర్ హైవే రోడ్డుపై వర్షానికి నీరు నిలవడంతో గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

**- చేవెళ్లటౌన్, జూన్ 13**



మున్సిపాలిటీ కేంద్రంలోని అంగడి బజారు కాలనీ లో డ్రైనేజీ పైప్‌లైన్ లీకై పొంగి పొర్లడంతో కాలనీవాసులు దుర్వాసనకు భరించలేక పోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**- చేవెళ్ల టౌన్**

# భూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు



కడ్తాల్: కర్కల్‌పహాడ్ గ్రామంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్యరాజు

షాబాద్, జూన్ 13: మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన షాబాద్ డిప్యూటీ తహసీల్దార్ మధు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులున్నారు.

**కడ్తాల్ :** మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్యరాజు హాజరై ప్రజల నుంచి 73 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజురెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**భూ సమస్యలను పరిష్కరించాలి**

యాచారం : మండల కేంద్రంలో నెలకొన్న భూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బ్రహ్మయ్య డిమాండ్ చేశారు. యాచారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ అయ్యప్పకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దరఖాస్తులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని బ్రహ్మయ్య కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ ఉన్నారు.

**కేశంపేట :** మండల పరిధిలోని అల్వాల, పోమాల్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్వాలలో 14, పోమాల్‌పల్లిలో 14 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ఆజంఅలీ తెలిపారు. కార్యక్రమంలో డీటీ గీత, ఆర్ఐలు నివేదిత, చెన్నకేశవులు, జూనియర్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

**తుర్కయంజాల్ :** మున్సిపాలిటీ పరిధి తుర్కయంజాల్, మన్నెగూడలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 173 దరఖాస్తులు అందినట్లు అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ సుదర్శర్‌రెడ్డి, అధికారులు తెలిపారు.

**ఆమనగల్లు :** మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో మండల తహసీల్దార్ లలిత ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 10 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు.

## తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలి



స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ

కొత్తూరు, జూన్ 13: తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించేవారికి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ పాత కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బాలాజీ మాట్లాడుతూ ప్రభుత్వం 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. అందులో భాగంగా 100 రోజుల ప్రణాళికను తయారు చేసి తడి, పొడి చెత్త వేరుచేయడం, సీజనల్ వ్యాధులపై అప్రమత్తత గురించి పుర ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, బాబూలాల్ చౌదరి, మున్సిపల్ వార్డు సభ్యులు, మెప్మా సిబ్బంది, స్వయం సహాయ సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం..**

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత ఆర్థిక అవగాహన అనే కార్యక్రమంలో మెప్మా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యాక్రమంలో ఎస్‌బీఐ ప్రతినిధులు, మున్సిపల్ వార్డు అధికారులు, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

తుర్కయాంజాల్, జూన్ 13: మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడసాగర్ ప్రధాన రహదారిని ఆనుకొని నిర్మిస్తున్న అక్రమ నిర్మాణానికి శుక్రవారం మున్సిపల్ అధికారులు నోటిసులు జారీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది నోటిస్‌ను భవనానికి అతికించి వెళ్లారు. అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని అధికారులు తెలిపారు.



అక్రమ నిర్మాణ భవనానికి నోటిసులు అతికిస్తున్న మున్సిపల్ సిబ్బంది